# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### మూడు గంటల్లో మూల కూడా తడువదు..

మూడు గంటలు కరెంటు ఇస్తే రైతులకు చాలా నష్టం. మూడు గంటల్లో ఏ మూల కూడా తడవదు. నిరంతర విద్యుత్ ఉంటేనే రైతు పంట పండించగలడు. ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరెంటు కష్టాలు లేవు. కరెంటు నిరంతరం ఉండాలంటే బీఆర్ఎస్ అధికారంలో ఉండాలి. గత ప్రభుత్వాలు విడుతల వారీగా విద్యుత్ సరఫరా చేయడంతో నాకు ఉన్న నాలుగు ఎకరాల్లో రెండు ఎకరాలు మాత్రమే సాగు చేసే వాడిని. కేసీఆర్ సర్కారు వచ్చిన తర్వాత 24గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా చేయడంతో నాలుగు ఎకరాలూ సాగు చేస్తున్నా. విడుతల వారీగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో మోటర్లు కాలిపోవడం, స్టార్టర్లు పాడైపోవడం వంటి బాధలు లేవు.

**- విజయ్, రైతు, మద్నూర్ మండలం**



### కేసీఆర్‌తోనే పచ్చనిపంటలు..

సీఎం కేసీఆర్ నేతృత్వంలో రైతులకు అందిస్తున్న 24 గంటల కరెంటుతో ఒక్క గుంట భూమి కూడా బీడుగా ఉండడం లేదు. ఎటు చూసినా పచ్చని పంటలే కనిపిస్తున్నాయి. తెలంగాణ రాక ముందు కరెంటు సరిగ్గా లేక భూములన్నీ బీడువారేవి. దీంతో రైతులంతా ఎక్కడెక్కడికో వలస వెళ్లేవాళ్లం. ఇప్పుడింక 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని కాంగ్రెసోళ్లు చెబుతున్నారు. ఆ మోటర్లు పెట్టాలంటే రైతుల నెత్తి మీద ఖర్చు పిడుగు పడుతుంది. అవి కరాబ్ అయితే రిపేరు చేయాలంటే మళ్లా అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తుంది. కేసీఆర్ ప్రభుత్వంలో కరెంటు ఇబ్బంది లేదు. మోటర్లు కాలుడు లేదు. ఇంత మంచి సౌలత్ ఉండంగ మళ్లా గా కాంగ్రెసోళ్లు వచ్చి ఏం జేస్తరు. కాంగ్రెస్ వస్తే మళ్లా రైతులంతా అప్పులబారిన పడుడే. అలాంటి వాళ్లకు అధికారం ఇచ్చి.. మన నోట్లో మనమే మట్టి పోసుకునుడు అవుతుంది.

**- హాళ్లగడ్డే హన్మంత్, మదన్‌హిప్పర్గా**



### మహారాష్ట్రలో మాదిరి గోసపడాలా?

కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి 3గంటల కరెంటు సరిపోతుందనడం వారి మూర్ఖత్వం. నాకున్న భూమిలో మినుము పండిస్తున్నా. మినుము పంటకు ఎకరానికి నీళ్లు పెట్టాలంటే 12 గంటల సమయం పడుతుంది. మరి మూడు గంటల కరెంటు వస్తే మునుపటి రోజులే వస్తాయి. మాతోని వ్యవసాయం చేయడం కాదు. కర్మ కాలి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మళ్లీ తెలంగాణ ప్రజలు, రైతులు వలస పోవాలసిందే. కాంగ్రెసోళ్ల మాటలు వింటే మళ్లీ బొంబాయికి పోవాల్సిందే.

**- మాధవ్‌రావ్, డొంగ్లీ**



## 10 హెచ్‌పీ.. దండుగే

### కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే జనరేటర్ల కాలం వస్తది..

కాంగ్రెస్ హయాంలో కరెంటు సరిగ్గా ఇచ్చేవాళ్లు కాదు. కండ్లముందు పంటలు ఎండిపోతే చూడలేక జనరేటర్లు కిరాయికి తెచ్చి నడిపించేవాళ్లం. దీంతో వోల్టేజీ సరిగ్గా రాక మోటర్లు కాలిపోయి అరిగోస పడ్డ రోజులు ఉన్నాయి. సీఎం కేసీఆర్ వచ్చిన నాటినుంచి అందిస్తున్న 24గంటల ఉచిత కరెంటుతో ఆ బాధలన్నీ పోయాయి. ఎప్పుడంటే అప్పుడు పొలం దగ్గరికి పోయి మోటరు ఆన్ చేస్తే నీళ్లు వస్తున్నాయి. కాంగ్రెసోళ్ల మాటలు విని వారిని గెలిపిస్తే.. మళ్లీ జనరేటర్ల కోసం, మోటర్ల రిపేర్ల కోసం మెకానిక్‌ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితే వస్తుంది. సీఎం కేసీఆర్ కరెంటు సరిగ్గా ఇస్తున్నారు కాబట్టే రెండు పంటలను సాగు చేస్తున్నాం. గతంలో ఒక్క పంటకే కరెంటు దిక్కులేక బీడు భూములుగా ఉంచుకునేటోళ్లం.

**- హన్మంత్‌రావ్ బల్లురే, మొఘ**



### రైతుల క్షేమం కోరేది కేసీఆరే..

రైతుల క్షేమం కోరేది సీఎం కేసీఆరే. కాంగ్రెసోళ్లకు రైతుల బాధలు తెల్వవు. ఎకరం ఎన్ని గంటల్లో పారుతుందో తెల్వదు. అందుకే మూడు గంటల కరెంటు సరిపోతుందని మూర్ఖత్వంతో మాట్లాడుతున్నారు. ఎకరం పారాలంటే 12గంటలు పడుతుంది. అందుకే సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన కరెంటును ఉచితంగా ఇస్తున్నాడు. మా దగ్గర 5హెచ్‌పీ మోటర్లు అయితే మస్త్. 10హెచ్‌పీ మోటరు పెడితే బోర్ల నీళ్లన్నీ ఒక్కసారిగా ఖతం అవుతాయి. బోరు వట్టిపోతుంది. రైతులను ముంచాలని చూస్తున్న కాంగ్రెస్‌కు రైతులమే బుద్ధి చెబుతాం.

**- రాజు పాటిల్, మదన్‌హిప్పర్గా**

## కాంగ్రెస్ వ్యాఖ్యలపై అన్నదాతల ఆగ్రహం



### కేసీఆర్‌తోనే మేం బాగున్నాం..

రైతులు బాగుండాలంటే నిరంతరం విద్యుత్ ఉండాలి. మూడు గంటలు కరెంటు ఉంటే తీవ్రంగా నష్టపోతాం. వ్యవసాయంపై జీవించే వారు చాలా ఉన్నారు. దేశానికి అన్నం పెట్టేవాడు రైతు. అలాంటి రైతు క్షేమాన్ని సీఎం కేసీఆర్ తలచి 24గంటలు కరెంటు ఇస్తున్నాడు. ఇప్పుడు కాంగ్రెస్ వచ్చి మూడు గంటల కరెంటు సరిపోతుందని చెప్పి.. రైతులకు సున్నం పెట్టాలని చూస్తున్నారు. అన్నం పెట్టే వారి వెంటే రైతులందరం ఉన్నాం. సున్నం పెట్టే వాళ్లను తరిమికొడతాం.

**- బలరాం, రైతు , మద్నూర్ మండలం**



### కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోం..

రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంటుతో పొలం పారుతదని అంటుండు. అది సాధ్యం కాదు. నాకు నాలుగు ఎకరాల పొలం ఉన్నది. ఈ పొలానికి మూడు గంటల కరెంటు ఎలా సరిపోతుంది. సీఎం కేసీఆర్‌కు రైతుల బాధలు తెలుసుకాబట్టే ఆయన 24గంటలు కరెంటు ఉచితంగా ఇస్తున్నడు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి మళ్లీ మోసపోం. రైతుల బతుకు ఆగం చేసేందుకు కొత్త నాటకం ఆడుతున్నారు. ఇక్కడ వాళ్లను నమ్మేటోళ్లు ఎవరూ లేరు.

**- బస్వంత్‌రావ్, మొఘ**

## మూడు గంటలిస్తే
# మునుగుడే

- రైతుల పాలిట భస్మాసుర 'హస్తం'..
- 24 గంటల కరెంట్ వృథా అట..
- మూడు గంటలు సరిపోతుందన్న రేవంత్
- 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని పిచ్చికూతలు
- ఓటుతో కాంగ్రెస్‌కు 'షాక్'ఇస్తామంటున్న రైతులు



ఒడ్డు మీద ఉన్నోడికి ఏం తెలుసు.. పొలంలోకి దిగి, పంట పండిస్తే తెలుస్తది ఎవుసం గురించి. ఏసీ రూముల్లో కూర్చునోడు మూడు గంటల కరెంటు ఇస్తే పొలం పారుతుందంట.. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాల్నని చెప్తడు.. గీ కాంగ్రెసోళ్లు కథలు చెప్పుట్ల నంబర్ వన్.. గీళ్ల గురించి మమ్మల్నే అడగాలె. దొంగరాత్రి కరెంటు ఇచ్చి రైతులను పొలాలపొంటి తిప్పిందెవరు.. పురుగు,బుసి కుట్టి అన్నదాత చచ్చేలా చేసిందెవరో మాకు తెల్వంది కాదు. కరెంటు లేక కండ్లముందు పంట ఎండుతుంటే తట్టుకోలేక రైతులు వేలాడిన ఉరికొయ్యలె చెప్తయ్. గా దేవుడే కేసీఆర్ రూపంలో వచ్చి మా రైతులను ఒక తొవ్వలోకి తెస్తే.. ఇప్పుడు కాంగ్రెసోళ్లు మళ్లొచ్చి మా నోట్లో మన్ను కొట్టాలని చూస్తున్నారని రైతులు అభిప్రాయపడుతున్నారు. అసలు వీరికి మళ్లీ అధికారం కట్టబెట్టేంత సాహసం చేయమని స్పష్టం చేస్తున్నారు.





# ధరణి ధర్మం గల్లది

### ధరణితో.. రైతు భూమికి భరోసా



ధరణి పోర్టల్ ఉంటేనే రైతు భూమికి పక్కా భరోసా ఉంటుంది. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే భూములకు సంబంధించిన కాగితాలను వీఆర్వోలకు అందజేసి వారు రికార్డుల్లోకి ఎక్కించే వరకు తిరగాల్సిన పరిస్థితి ఉంటుండే. ఇప్పుడు ఆ తిప్పలు లేవు. ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. క్షణాల్లో తమ పేరుపైన భూమి రికార్డుల్లో నమోదవుతుంది. ధరణి లేకపోతే కార్యాలయాల్లో ఎప్పుడు మనభూమి మన పేరు మీద ఉంటదో, రాత్రికి రాత్రి ఇంకోళ్ల పేరు మీదకు మారుతుందో తెలియదు. పహాణీల వ్యవస్థ ఉన్నప్పుడు ఎంతోమంది భూములు ఇంకొకరి పేరు మీదికి మార్పిడి అయ్యాయి. అంత అవినీతీమయంతో ఉండేది. ఇప్పుడు ఆ బాధలేదు. మన భూమి మన చేతిలోనే ఉంటుంది.

**- శంకర్, రైతు మద్నూర్ మండలం**

### ధరణితో చాలా మేలు..



తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణితో చాలా మేలు జరిగింది. గతంలో రికార్డులు తారుమారు అయ్యేవి. ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకోగానే తమ పేరున రికార్డులో నమోదవుతుంది. దీంతో ఎవరి వద్దకు తిరగాల్సిన పనిలేదు. ధరణి ఉంటేనే రైతుకు మేలు. ధరణి రద్దు చేస్తే తమ భూములకు గ్యారంటీ ఉండదు. ధరణి లేకపోతే రిజిస్ట్రార్ ఆఫీసులు, పట్వారీల చుట్టూ చక్కర్లు కొట్టాల్సిన పరిస్థితి ఉంటుంది. కేసీఆర్ సార్ తీసుకువచ్చిన ధరణి చాలా బాగున్నది. ఇది వద్దంటున్న కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెబితేనే ఇంకోసారి ధరణి గురించి మాట్లాడకుండా ఉంటారు.

**- బస్వరాజ్, రైతు మేనూర్, మద్నూర్ మండలం**

### వైట్‌నర్లు పెట్టి పట్టాలు మార్చిండ్రు..



తెలంగాణ రాక ముందు కాగితాలపై రాసిన పేర్లను వైట్‌నర్లతో తొలగించి పేర్లు మార్చిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు మళ్లా అదే కాంగ్రెస్ పార్టీ వాళ్లు వారిని గెలిపిస్తే రెవెన్యూ వ్యవస్థలో పాత పద్ధతులు తెస్తామంటున్నారు. పటేల్, పట్వారీ వ్యవస్థ మళ్లీ వస్తే రైతులకు గోస మొదలైనట్లే. పట్టాదారు స్థానంలో అనుభవదారు, మాన్యందారు కాలమ్‌లు పెట్టడంతో నిజమైన పట్టాదారుకు తిప్పలు తప్పవు. పటేల్, పట్వారీ వ్యవస్థతో తిరిగి లంచగొండి, దోపిడీ వ్యవస్థ వస్తుంది. రైతు వ్యతిరేకి కాంగ్రెస్ పార్టీని తరిమికొడితేనే రాష్ట్రం బాగుపడుతుంది.

**- జైపాల్‌రెడ్డి, లింబూరు**

### ధరణిపోతే రైతులకు గోస..



సమైక్య పాలనలో లంచాలు ఇస్తే చాలు రాత్రికి రాత్రే రికార్డుల్లో భూయజమానుల పేర్లు మారేవి. భూ వివాదాలతో రైతులు కోర్టు, పోలీసు స్టేషన్ల మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చేది. భూ తగాదాలతో హత్యలు, ఆత్మహత్యలు చోటు చేసుకున్న ఘటనలు ఎన్నో. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో మొత్తం వ్యవస్థ మంచిగా తయారైంది. మా పేరిట ఉన్న భూమి మేము సంతకం, వేలిముద్ర పెడితే తప్పా మరొకరి పేరు మీదకు మారకుండా చేశారు. భూ వివాదాలకు తావు లేకుండా చేశారు. కాంగ్రెస్ నాయకుల కళ్లబొల్లి మాటలు విని.. వారిని గెలిపిస్తే ధరణిని రద్దు చేసి అవకతవకల పద్ధతిని రైతుల నెత్తిన చుడతారు. ఇగ మళ్లీ ఘర్షణలు, గొడవలు మొదలవుతాయి. రైతులంతా ఆగమాగం అవుతారు.

**- అశోక్‌పాటిల్, మదన్‌హిప్పర్గా**

### వీఆర్వోలతో రైతులకు మళ్లీ కష్టాలే..



కాంగ్రెసోళ్లు వస్తే మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థ తెస్తామని చెబుతున్నారు. వీఆర్వోలు మళ్లీ వస్తే రైతులకు కష్టాలు మొదలైనట్లే. గతంలో భూ రికార్డులకు సంబంధించిన కాగితాల కోసం వీఆర్వోల దగ్గరికి వెళితే ముప్పు తిప్పలు పెట్టి రోజుల తరబడి తిప్పుకునేవాళ్లు. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత రికార్డులన్నీ ఆన్‌లైన్‌లోనే ఉంటున్నాయి. రైతులమే స్వయంగా తహసీల్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ సమయంలో వేలిముద్ర ఇస్తే తప్పా భూ బదలాయింపు జరగడం లేదు. ఇంతటి గట్టి వ్యవస్థను పెట్టిన సీఎం కేసీఆర్‌ను కాదని గా కాంగ్రెసోళ్లను మళ్ల అధికారంలోకి తెస్తామా? తేం.

**- మాధవ్‌రావ్ బల్లురే, మొఘ**



### కాంగ్రెస్ వస్తే చెప్పులరుగుతాయి..



గతంలో ప్రభుత్వ భూములు కనిపిస్తే కబ్జా చేసి లంచాలు ఇచ్చి తమ పేరు మీదకు మార్చుకునే వాళ్లు. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత ప్రభుత్వ భూమి గుంట కూడా ప్రైవేటు వ్యక్తులకు, కబ్జాకారుల చేతుల్లోకి వెళ్లడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ధరణిని రద్దు చేస్తే మళ్లీ పాత రోజులే వస్తాయి. రైతులు తమ భూములను కాపాడుకునేందుకు గవర్నమెంటు ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగే వరకు తిరగాల్సిన పరిస్థితి వస్తుంది. సీఎం కేసీఆర్ తెచ్చిన ధరణితో రైతుల భూములకు కట్టుదిట్టమైన రక్షణ ఉంటుంది. ఇంత మంచి వ్యవస్థను మా ఓటుతో కూలగొట్టబోము. రైతులను ఆగం చేయాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెబుతాం.

**- జిలానీ, మొఘ**

